క్లుప్తంగా

నేడు బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ

త్రిపురాంతకం: బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమానికి ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ సోమవారం రానున్నారు. త్రిపురాంతకంలో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో నిర్వహించనున్న కార్యక్రమానికి గ్రామాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలిరానున్నారు. కార్యక్రమంలో భాగంగా త్రిపురాంతకంలో ర్యాలీ, సభ నిర్వహించనున్నారు.

కార్మికులకు గొడుగుల పంపిణీ


గొడుగులు పంపిణీ చేస్తున్న దృశ్యం

దర్శి: దర్శి పట్టణంలో మాజీ మంత్రి శిద్దా రాఘవరావు పుట్టిన రోజు వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. శిద్దా ప్రతినిధి మండాది సుబ్బారావు ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కేక్ కట్ చేసి మున్సిపల్ కార్మికులకు అన్నదానం, గొడుగులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ నాయకులు పాల్గొన్నారు.

250 మందికి వైద్య పరీక్షలు

టంగుటూరు: మండలంలోని పొందూరు గ్రామంలో పమిడి కోటయ్య వెంకట శేషమ్మ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఎయిమ్స్ హాస్పిటల్ వారు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 250 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేసినట్లు వైద్యులు రమణారెడ్డి, రామ లింగేశ్వరరావు, కార్తీక్, నిరజ తెలిపారు. కార్యక్రమంలో విజ్ఞాన కేంద్రం అధ్యక్షుడు కాట్రగడ్డ రమేషబాబు, ప్రధానోపాధ్యయుడు యాతం శ్రీనివాస్, పమిడి ప్రసాద్, గ్రామ సర్పంచ్ కోటిలింగం, ఎంపీటీసీ నాగేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ బలరాం, గ్రామ పెద్దలు ఏరువ అనందరావు, శివరామ కృష్ణ, మాజీ సర్పంచ్ ఆవుల వెంకటేశ్వర్లు, కొల్లూరి సుధాకర్ పాల్గొన్నారు.

తీరిన ఓల్టేజీ సమస్య

కొండపి: మండలంలోని పెట్లూరు సబ్‌స్టేషన్ పరిధిలో చాలా కాలంగా ఓఎల్‌టీసీ మరమ్మతులకు గురైంది. మరమ్మతులకు గురైన ఓఎల్‌టీసీ ఆదివారం ఉదయం 9:30 గంటల నుంచి టీఆర్‌ఈ ఏఈ ఆధ్వర్యంలో కంపెనీ సిబ్బంది మరమ్మతులు చేశారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాసరావు మాట్లాడుతూ పెట్లూరు సబ్‌స్టేషన్‌లోని ఓఎల్‌టీసీ కొన్ని నెలలుగా మరమ్మతులకు గురవడంతో సబ్‌స్టేషన్ పరిధిలోని కొన్ని గ్రామాలకు కొండపి సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా చేస్తున్నామన్నారు. అందువల్లే లో ఓల్టేజీ సమస్య తలెత్తిందన్నారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి మరమ్మతులు చేశామన్నారు.

ఆర్థికసాయం అందజేత

కనిగిరిరూరల్: మోడల్ స్కూల్ విద్యార్థి కుటుంబానికి ఎస్ఎస్ఎంసీ కమిటీ సభ్యులు రూ.5వేల ఆర్థిక సాయం ఆదివారం అందచేశారు. మోడల్ స్కూల్ ఎస్ఎంసీ కమిటీ సభ్యుడు, ఏడో తరగతి విద్యార్థి వికిల్ తండ్రియ నాగేంద్రబాబు అనారోగ్యంతో చికిత్స పొందుతూ ఇటీవల మృతి చెందారు. విద్యార్థి కుటుంబాన్ని మోడల్ స్కూల్ ఎస్ఎంసీ కమిటీ సభ్యులు పరామర్శించి చిరు సాయాన్ని అందచేశారు. ఎస్ఎంసీ కమిటీ చైర్మన్ పందిటి మోహన్, బోస్, సత్యం, జెర్మియా, సురేష్, బొడ్డు వేణుగోపాల్ పాల్గొన్నారు.

అమ్మో.. కొబ్బరి బాంబ్!



- కొండెక్కిన కొబ్బరి కాయ
- భారీగా పెరిగిన టెంకాయల ధరలు దీంతో పాటు ఎండు కొబ్బరి, కొబ్బరి నూనెలు సైతం
- శ్రావణమాసంలో ఆందోళన చెందుతున్న మహిళా భక్తులు

పెద్దదోర్నాల: శుభకార్యాలకు, కోర్కెలు తీరేందుకు, ఆలయంలో కొట్టే కొబ్బరికాయ బాంబులా పేలుతోంది. బహిరంగ మార్కెట్‌లో కొబ్బరి కాయల ధరలు కొండెక్కాయి. దీంతో మహిళా భక్తులు ఆందోళన చెందుతున్నారు. ద్వాదశ జ్యోతిర్లింగాలు, అష్టాదశ శక్తి పీఠాలలో ఒకటిగా పేరొందిన శ్రీశైల ముఖద్వారంగా పిలవబడుతున్న మండల కేంద్రం ఎంతో ఆధ్యాత్మిక కేంద్రంగా వెలుగొందుతోంది. శ్రీశైలం వెళ్లే యాత్రికులతో పాటు, స్థానిక భక్తులు సైతం నిరంతరం భక్తిశ్రద్ధలతో దేవతలను కొలుస్తుంటారు. దీంతో పాటు శ్రావణ మాసం కావటంలో పూజలు, హోమాలు, శుభకార్యాలు సైతం పెరిగాయి. ఈ నేపథ్యంలో కొబ్బరి కాయల ధరలు భారీగా పెరగటంతో భక్తులు అందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని రోజుల క్రితం ఒక్కో కొబ్బరి కాయ రూ.20 నుంచి రూ.25 పలికితే, ప్రస్తుత మార్కెట్ ఒక్కో కొబ్బరి కాయ రూ.50 నుంచి రూ.60 వరకు పలుకుతోంది. దీంతో మండలంలోని పలువురు మహిళా భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


ఎండు కొబ్బరి

ముందుగా గుర్తుకు వచ్చేది కొబ్బరికాయే..

సామాన్యంగా ఏదైనా శుభకార్యం జరుగుతుందంటే మొదటగా మనకు గుర్తొచ్చేది కొబ్బరి కాయే. అటువంటి కొబ్బరి కాయల ధరలు సామాన్య భక్తులకు అందనంత ఎత్తుకు చేరటంతో భక్తులు అందోళన చెందుతున్నారు. మండల కేంద్రంలో అయ్యప్పస్వామి ఆలయం, లక్ష్మీనరసింహస్వామి ఆలయం, వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం, గ్రామదేవత పోలేరమ్మ ఆలయం, విశ్వేశ్వరుడి ఆలయంలాంటి ముఖ్య అలయాలతో పాటు మరి కొన్ని అలయాలు, ఆశ్రమాలు మండల కేంద్రంలో ఉన్నాయి. వీటిలో పూజల కోసం వందలాది మంది భక్తులు ఆలయాల వద్దకు వెళ్తుంటారు. ఈ నేపథ్యంలో కొబ్బరి కాయలు కొనాలంటేనే హడలిపోతున్నారు. శ్రావణమాసంలో కొబ్బరి కాయలకు భారీగా డిమాండ్ ఉన్న నేపథ్యంలో మార్కెట్‌లో కొబ్బరి కాయల ధర రూ.50 పైనే పలుకుతుండటం భక్తులను భయపెడుతున్నాయి. శ్రావణ మాసంలో వచ్చేవన్నీ ముఖ్యమైన పండుగలే కాబట్టి కొబ్బరి కాయల ధరలు ఇప్పట్లో తగ్గేలా లేవని పలువురు నిపుణులు పేర్కొంటున్నారు.


కొబ్బరి కాయలు

రెట్టింపైన కొబ్బరి కాయల ధరలు..

ప్రస్తుతం కొబ్బరి కాయల ఉత్పత్తి తగినంతగా లేక పోవటం వల్లే ధరలు భారీగా పెరిగాయని పలువురు వ్యాపారులు పేర్కొంటున్నారు. గత మూడు నెలల కాలంతో ఒక్కో కొబ్బరికాయ రూ.20 పలికితే ప్రస్తుత కొబ్బరి కాయ ధర రెట్టింపై రూ.50 పైగానే పలుకుతుందని వారు పేర్కొంటున్నారు. దీంతో పాటు ఎండు కొబ్బరి రేట్లు సైతం అమాంతం పెరిగాయి. గత మూడు నెలల క్రిందట కిలో ఎండు కొబ్బరి రూ.240 పలికితే ప్రస్తుత మార్కెటో రెట్టింపై రూ.400 పలుకుతోంది. అర కిలో కొబ్బరి నూనె గతంలో రూ.180 కాగా, ప్రస్తుత మార్కెట్‌లో రూ.250 పలుకుతుండటం విశేషం. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి భక్తులకు ఇబ్బంది కరంగా మారిన కొబ్బరికాయల ధరలను నియత్రించాలని భక్తులు కోరుకుంటున్నారు.

ప్రభుత్వ హామీలు అమలు చేయాలి


మాట్లాడుతున్న తాండవ రంగారావు


ఎన్నికైన నూతన కమిటీ

దొనకొండ: కూటమి ప్రభుత్వం కార్మిక, ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు తాండవ రంగారావు పేర్కొన్నారు. ఆదివారం దొనకొండ యూటీఎఫ్ కార్యాలయంలో జరిగిన సీఐటీయూ మండల 3వ మహాసభకు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పంచాయతీ స్వచ్ఛ భారత్, అంగన్‌వాడీ, ఆశా మధ్యాహ్న భోజనం నిర్వాహకులకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే వేతనాలు పెంచుతామని హామీ ఇవ్వటంతో భారీ మెజార్టీతో గెలిపించారని, అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా ఇంత వరకు ఏ ఒక్క కార్మికుడు, ఉద్యోగులకు, స్కీము వర్కర్లకు వేతనాలు పెంచలేదన్నారు. ప్రభుత్వం కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, సీఐటీయూ కార్మికులను ఐక్యం చేసి పోరాటం చేయటం ద్వారా హక్కులు సాధించుకోవచ్చన్నారు. దొనకొండ సీఐటీయూ మండల కార్యదర్శి చిరుపల్లి అంజయ్య, సివిల్ సప్లయి ముఠా అధ్యక్షులు గుడిమెట్ల ఆదాము మాట్లాడుతూ మండలంలో కార్మికుల కోసం సీఐటీయూ నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. కార్మిక ఉద్యమంలో పోరాటాలు చేసి మరణించిన నాయకులకు కుందుర్తి చిన్న నరసింహులు సంతాపం తెలుపగా కార్మికులు హాజరై నివాళులర్పించారు.

దొనకొండ మండల నూతన కమిటీ ఎన్నిక..

సీఐటీయూ మండల కన్వీనర్‌గా చిరుపల్లి అంజయ్యతో పాటు 13 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా గుడిమెట్ల ఆదాము, బాలకాశయ్య, యేసుదాసు, పి.లూకయ్య, కాశింపీరా, జి.వెంకటస్వామి, రామదుర్గం నరసింహారావు, వై.కోటేశ్వరరావు, బాలరాజు, లలితకుమారి, కె.కరుణ, వినోదిని, శ్రీనివాసరావులు ఎన్నికయ్యారు. బోయిన చిన్న పాపారాయుడులను జిల్లా ఉపాధ్యక్షుడిగా తాండవ రంగారావు సమక్షంలో ఎన్నుకున్నారు.

దగ్ధమైన ట్రాక్టర్‌ను పరిశీలించిన డీఎస్పీ


ట్రాక్టర్‌ను పరిశీలిస్తున్న మార్కాపురం డీఎస్పీ నాగరాజు

పుల్లలచెరువు: గుర్తుతెలియని వ్యక్తులు ట్రాక్టర్‌ను దగ్ధం చేయడంతో పోలీసులు పరిశీలించారు. శుక్రవారం రాత్రి మండలంలోని శతకోడు గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తులు ట్రాక్టర్‌ను తగలపెట్టిన ఘటన తెలిసిందే. ఆదివారం మార్కాపురం డీఎస్పీ నాగరాజు ఎస్ఐ సంపత్‌కుమార్‌తో కలిసి శతకోడులోని ట్రాక్టర్ తగలబడిన స్థలాన్ని పరిశీలించారు. ఈఘటనపై గ్రామస్తులను, ట్రాక్టర్ యజమానిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. తమ సిబ్బందితో విచారణ చేసి బాధ్యులను త్వరలోనే గుర్తిస్తామని డీఎస్పీ తెలిపారు.

గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు


అలంకరణలో పోలేరమ్మ అమ్మవారు


ప్రత్యేక అలంకారంలో కాటమరాజుస్వామి


ప్రత్యేక అలంకరణలో గంగమ్మ

తాళ్లూరు: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన తూర్పుగంగవరం పంచాయతీ పరిధిలోని సోమవరప్పాడులో కొలువై ఉన్న గుంటి గంగా భవానీ అమ్మవారికి మాజీ డీఎస్పీ నారాయణస్వామి రెడ్డి తమ కుటుంబ సభ్యులు, భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు కుంకుమార్చన అష్టోత్తరం ఆశీర్వచనం ఇచ్చారు. ముందుగా పూజారులు మెట్టిల బాలరాజు, పి.విజయలక్ష్మి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ అర్చకుడు కామేశ్వరశర్మ అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చన చేశారు. భక్తులు పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. భక్తులకు అవసరమైన వసతులు ఏర్పాట్లను ఆలయ ఈఓ జి.వాసుబాబు, చైర్మన్ కె.గురుబ్రహ్మం, ఏఆర్ కె.ప్రసాద్, సిబ్బంది పర్యవేక్షించారు.

గుండంచర్లలో..

పెద్దారవీడు: మండలంలో గుండంచర్ల గ్రామం సమీపంలో నల్లమల అడవిలో వెలసిన గంగాభవానీ వేనూతల కాటమరాజుస్వామి, మండల కేంద్రం పెద్దారవీడు గ్రామం సమీపంలో వెలసిన అంకాళమ్మ దేవత, ఎస్ కొత్తపల్లి గ్రామం సమీపంలో వెలసిన నాగాంజనేయస్వామి పుట్టకు ఆదివారం భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. కాటమరాజుస్వామి, గంగభవానీ దేవతకు అభిషేకాలు, కుంకుమార్చన, పూజలు చేసి పట్టువస్త్రాలు, పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు అంకాళమ్మ దేవతకు పసుపు, కుంకుమ, చీరలు, గాజులు, నాగమయ్యపుట్టకు పాలు, పండ్లు సమర్పించారు. ఆలయాల ప్రాంగణంలో పొంగళ్లు తయారు చేసి స్వామి, అమ్మవార్లకు చెల్లించారు. చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని, కాయకర్పూరం సమర్పించి, మొక్కుబడులు చెల్లించారు.

పోలేరమ్మకు పూజలు

దొనకొండ: స్థానిక ఆనంద ఆశ్రమంలో వెలసిన పోలేరమ్మకు భక్తులు ఆదివారం పూజలు నిర్వహించారు. శ్రావణ బహుళ పాడ్యమి పురస్కరించుకుని ఆనంద ఆశ్రమం ఉత్తర ద్వారం పక్కన వెలసిన పోలేరమ్మకు ఉదయం 6 గంటల నుంచి అభిషేకాలు ప్రత్యేక అలంకరణ, అష్టోత్తర శతనామావళి పూజలు నిర్వహించారు. భక్తులు మహా నైవేద్యం సమర్పించారు. ఆశ్రమ అర్చకులు మణిబాబు శర్మ పూజలు చేశారు. విచ్చేసిన భక్తులకు భైరవానంద స్వామి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

మహిళలకు శాపంలా కూటమి పాలన

- వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జోనల్ ప్రెసిడెంట్ గంగసాని లక్ష్మి

పామూరు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ పాలన మహిళల పాలిట శాపంలా మారిందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా విభాగం జోనల్ ప్రెసిడెంట్, పామూరు ఎంపీపీ గంగసాని లక్ష్మి అన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మద్యంపై కూటమి ప్రభుత్వ నిర్ణయాలు మహిళల జీవితాలను నాశనం చేసేలా ఉన్నాయని ధ్వజమెత్తారు. ఎన్నికల వేళ ఓట్లకోసం మహిళలందరికీ రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా బస్సు ప్రయాణం ఉచితమంటూ హామీ ఇచ్చిన చంద్రబాబు నేడు ఆపథకం అమలులో షరతులు విధించి కొన్ని బస్సుల్లోనే ఉచితమంటూ మోసం చేస్తున్నారని మండిపడ్డారు. ఉచితబస్సు పథకం అమలు అయితే ఎంతో మంది పేద మహిళలు తమ సొంత పనులతోపాటు బతుకుదెరువుకోసం ఇతర ప్రాంతాలకు వెళ్లి వచ్చేందుకు, రాష్ట్రంలోని ప్రముఖ ప్రముఖ పుణ్యక్షేత్రాలు దర్శించుకునే అవకాశం కలుగుతుందని ఎంతో ఆశపడ్డారన్నారు. అయితే కూటమి ప్రభుత్వం ఈ పథకంపై ఏడాదిగా నాన్చుతూ వచ్చి ఎన్నో కొర్రీలు పెడుతూ చివరకు కొన్ని బస్సు సర్వీస్‌లోనే మహిళలకు ఉచిత ప్రమాణమని ప్రకటించడంతో రాష్ట్రంలోని మహిళలు నిరాశకు గురవుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక రాష్ట్రంలో బడి, గుడి అన్న తేడా లేకుండా ఎక్కడపడితే అక్కడ మద్యం షాపులు ఏర్పాటు చేయడంతో మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. చాలా చోట్ల మద్యం బాటిళ్లను అనుమతులు ఉన్న మద్యం దుకాణాల్లో కాకుండా బెల్ట్ దుకాణాలు, రోడ్డుపక్కన దుకాణాల్లో విక్రయిస్తున్నారని దీంతో నిత్యం ఏదో ఒక ప్రాంతంలో మహిళలపై దాడులు అదే విధంగా మద్యం మత్తులో రోడ్డు ప్రమాదాలు అధికమవుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. గతంలో మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తెచ్చిన మద్యం విధానం ద్వారా 2019–24 మధ్య మద్యం అమ్మకాలు గణనీయంగా తగ్గాయని, రాష్ట్రంలో బెల్ట్ దుకాణాలు లేకుండాచేశారని కాగా నేడు దానికి భిన్నంగా కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో మద్యాన్ని ఏరులై పారిస్తుందన్నారు. దీనికి తోడు మద్యం దుకాణం పక్కనే పర్మిట్ రూములు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో అవి మద్యపానానికి అడ్డాగా మారతాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని తన నిర్ణయాన్ని మార్చుకోవాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజల తరుపున పోరాటం చేస్తామని, వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకుపోయి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామన్నారు. సమావేశంలో పార్టీ మహిళావిభాగం జిల్లా కార్యదర్శి గాయకవాడ సుహాసిని, పార్టీ పట్టణ అధ్యక్షురాలు ఓరుగంటి పద్మ, పందిటి వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నిధులు చెత్తపాలు



నిరుపయోగంగా చెత్త సంపద కేంద్రాలు

- గ్రామాల్లో నిరుపయోగంగా చెత్త సంపద కేంద్రాలు
- పల్లెల్లో కనిపించని చెత్త సేకరణ
- శ్రమకు తగిన ఫలితం లేక అల్లాడుతున్న గ్రీన్ అంబాసిడర్‌లు
- ఫొటోలకు ఫోజులిచ్చి మమ అనిపిస్తున్న మండలస్థాయి అధికారులు
- అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారిన వైనం

కనిగిరిరూరల్: అధికారుల నిర్లక్ష్యంతో లక్షల రూపాయల ప్రజాధనం చెత్త పాలవుతోంది. ఎన్నో ఏళ్ల క్రితం లక్షల రూపాయల ప్రజాధనం వెచ్చించి నిర్మించిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలే ఇందుకు నిదర్శనం. దాదాపు గ్రామాల్లో చెత్త సంపద కేందాలు ఉత్త కేంద్రాలుగా మారాయి. చెత్తతో వర్మీ కంపోస్ట్ తయారు చేసి విక్రయించడం ద్వారా పంచాయతీలకు అదనపు ఆదాయం అందించాలనే ఉన్నత లక్ష్యంతో ఏర్పాటు చేసిన చెత్త సంపద కేంద్రాలు ప్రణాళికా లోపం, శ్రమకు తగ్గ ఫలితం లేక కార్మికుల దూరంగా ఉండటం, అధికారుల నిర్లక్ష్యం వెరసి లక్ష్యానికి దూరంగా మారి చెత్త సంపద కేంద్రాలు అసాంఘిక కార్యకలాపాలకు, మందుబాబులకు నిలయంగా మారాయి. ఒకటి రెండు చోట్ల వినియోగంలో ఉన్నా దాదాపు 90 శాతం అలంకారప్రాయంగా మారి ప్రభుత్వాల తీరును వెక్కిరిస్తున్నాయి.

అప్పుడప్పుడు.. ఫొటోలకు ఫోజు..

గ్రామాల్లో వచ్చే తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి ఎరువులను తయారు చేయాలనే ఉద్దేశంతో రూ.లక్షలు ప్రజాధనం వెచ్చించి ఈ చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అయితే ఏళ్లు గడుస్తున్నా అధికారుల నిర్లక్ష్యంతో ఈ కేంద్రాలు ఎందుకు పనికిరాకుండా ఉన్నాయి. మండల స్థాయి అధికారులు అప్పుడప్పుడు ప్రత్యేక కార్యక్రమాలకు గ్రామాలకు వచ్చి.. చెత్త సంపద కేంద్రాల వద్ద నిలబడి ఫొటోలకు ఫోజులిచ్చి మమ అనిపించి చేతులు దులుపుకుంటున్నారు. అంతే కానీ ప్రజాధనం ఉపయోగించి నిర్మించిన వీటిని వినియోగంలోకి తీసుకువచ్చేందుకు ఒక్కరంటే ఒక్కరూ కూడా చర్యలు తీసుకోవడం లేదు. ఫలితంగా ప్రజాధనం లక్షల్లో చెత్త పాలైంది. రిఫ్రెషర్ శిక్షణా కార్యక్రమం పేరుతో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లకు గ్రామాల్లో గత ఏడాది ఆగస్టు 12 నుంచి 14వ తేదీ వరకు శిక్షణా తరగతులు నిర్వహించారు. అయినా క్షేత్ర స్థాయిలో అవి లక్ష్యానికి దూరంగా ఉన్నాయి.

ఉన్నా ఉపయోగం సున్నా...

కనిగిరి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 135 పంచాయతీలు ఉన్నాయి. అందులో దాదాపు 75 శాతానికి పైగా చెత్త సంపద కేంద్రాలు నిర్మాణాలను బట్టి రూ.5 నుంచి రూ.10 లక్షలు వెచ్చించి స్వచ్ఛాంధ్ర, తదితర నిధులతో నిర్మించారు. కొన్ని ప్రాంతాల్లో స్థల లేమి, నిధుల కొరత, అధికారుల నిర్లక్ష్యంతో నిర్మాణం కాలేదు. ప్రతి 250 గృహాలకు, 1000 మంది జనాభాకు ఒక గ్రీన్ అంబాసిడర్‌ను నియమించారు. అంటే నియోజకవర్గంలో సుమారు 250 నుంచి 300 మంది వరకు గ్రీన్ అంబాసిడర్‌లు ఉన్నారు. అయితే వీరికి ఇచ్చే జీతానికి వీరు చేసే పనికి శ్రమ దోపిడీకి గురవుతున్నారు. చాల కాలం నుంచి గ్రీన్ అంబాసిడర్లకు రూ.6 నుంచి 10 వేలు మాత్రమే వేతనాలు ఇస్తుడంటంతో చాలా మంది అయిష్టం, అసంతృప్తి, నామ్‌కే వాస్తేగా పనిచేస్తున్నారు. అంతేగాక పంచాయతీకి దూరంగా.. కనీసం రెండు మూడు కిలో మీటర్లు దూరంగా ఉండటంతో గ్రీన్ అంబాసిడర్‌లు చెత్త, సేకరణ, ఆ తర్వాత అంత దూరం తీసుకెళ్లడం, అక్కడ తడి పొడి చెత్త వేరుగా వేసి, ఏరువుగా మార్చడం ఈ ప్రక్రియ అంతా వీరికి తలకు మించిన భారంగా మారింది. శ్రమకు తగ్గ ఫలితం లేకపోవడంతో అనేక ప్రాంతాల్లో తూతూమంత్రంగా నిర్వహిస్తున్నారు. దాదాపు ఎక్కడా ఈ పనులు జరగడం లేదు. కార్మికులు చెత్త సేకరణ చేయడం లేదు. దీంతో చెత్త సంపద కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. అధికారుల పర్యవేక్షణ లోపంతో ఆ కేంద్రాలు మందు బులకు, అసాంఘిక కార్యకలాపాలకు, పశువులకు ఆవాస కేంద్రాలుగా మారాయి.

ఘనంగా కదిరి బాబూరావు జన్మదిన వేడుకలు

సీఎస్‌పురం(పామూరు): వైఎస్సార్‌సీపీ విశాఖ పార్లమెంట్ పరిశీలకుడు, కనిగిరి మాజీ ఎమ్మెల్యే కదిరి బాబూరావు జన్మదిన వేడుకలు ఆదివారం మండలంలోని శీలంవారిపల్లె కదిరి బాబూరావు వ్యవసాయ, ఉద్యానవన కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా నాయకులు మునగల నారాయణరెడ్డి, మూరం కాశిరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేశారు.

పట్నం తిరుపతయ్య, ఉపసర్పంచ్ టి.బాబూరావు, నున్నా నారాయణ, షేక్.నాయబ్‌రసూల్, పాశం సురేష్, కదిరి రఘు, షేక్.అహ్మద్, సుంకరి అంజనాద్రి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాకల తీరంలో పర్యాటకుల సందడి


పాకల తీరంలో పర్యాటకులు

సింగరాయకొండ: పాకల సముద్ర తీరంలో ఆదివారం సెలవు దినం కావడంతో పర్యాటకుల తాకిడి అధికంగా ఉంది. మండలంతో పాటు చుట్టుపక్కల మండలాల ప్రజలు పెద్ద సంఖ్యలో తీరానికి చేరుకుని సముద్రస్నానం చేస్తూ సేదతీరారు. తీరంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా మెరైన్ పోలీసులు ఎప్పటికప్పుడు పర్యాటకులను అప్రమత్తం చేశారు.

ధర్మకర్తల మండలి నియామక ఉత్తర్వులు జారీ

జరుగుమల్లి(సింగరాయకొండ): జరుగుమల్లి మండలం కామేపల్లిలోని ప్రసిద్ధిచెందిన పోలేరమ్మతల్లి దేవస్థానం నూతన ఆలయ ధర్మకర్తల మండలి నియామకానికి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి వై భైరాగి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 11వ తేది నుంచి 20 వ తేదీ లోగా ఆశాశాహులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. దరఖాస్తులను ఆలయంలోని ఈఓ కార్యాలయంలో అందజేయాలని చెప్పారు.

ఘనంగా యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

కనిగిరిరూరల్: యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని కనిగిరిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర నాయకులు ఎస్‌కే ఖాజా రంతుల్లా మాట్లాడుతూ ఉపాధ్యాయుల సంక్షేమం కోసం, సమస్యల కోసం నిరంతరం పోరాడేదే యూటీఎఫ్ అన్నారు. జిల్లా కార్యదర్శి టి.రమణారెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుల హక్కుల సాధనకు, సమస్యల పరిష్కారానికి అనేక పోరాటాలు యూటీఎఫ్ నేతలు చేసినట్లు వివరించారు. తొలుత యూటీఎఫ్ జెండాను కె.కృష్ణమూర్తి, వి.మాలకొండారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు ఎం రాము, కృష్ణమూర్తి, మాలకొండారెడ్డి, పట్నం నరసింహులు, బి.మల్లికార్జున, కె.వెంకటేశ్వర్లు, టీపీ సుబ్బారెడ్డి, బి.మాల్యాద్రి, రమేష్, జడ్ బ్రహ్మయ్య, టి.పెద్దిరెడ్డి, శేషగిరి, యరమణయ్య, కేవీ బాలకృష్ణ, ఎస్‌కే షాహీద్, రాము, పి.శ్రీనివాసులు, ఎస్‌కే జిలానీ, రామారావు, వెంకటేశ్వర్లు, కాశయ్య, రఘురామిరెడ్డి, వై వెంకట్‌రెడ్డి, పదిలం బాబు పాల్గొన్నారు.